# ధైర్యే సాహసే లక్ష్మి..

అవంతిపురాన్ని పరిపాలించే రాజు శూరసేనుడు ఒకనాడు సభలో ఆసీనుడై ఉన్నాడు. రాజసభ అంతా రాజోద్యోగులతో, దేశ ప్రజలతో కిటకిటలాడుతోంది.

మంత్రి మాధవవర్మ "రాజుగారు మరి కొద్దిసేపట్లో మిమ్మల్నందరినీ ఉద్దేశించి ప్రసంగిస్తారు. అంతేకాదు ఎప్పటిలాగానే కొన్ని ప్రశ్నలు వేస్తారు. సమాధానాలు చెప్పిన వారికి మంచి బహుమతులు ఉంటాయి. మరి అందరూ సిద్ధంగా ఉండండి" అన్నాడు.

మంత్రి మాట్లాడుతున్నప్పుడు రాజుగారు సింహాసనం మీద నుంచి లేచి, పిల్లిలా నడుచుకుంటూ మంత్రి ఆసనం దగ్గరకెళ్లి అక్కడ ఉన్న రత్నఖచిత ఖడ్గాన్ని తీసుకుని వెళ్లి తన స్థానంలో కూర్చున్నాడు. ఆ తరువాత ఏమీ ఎరగనట్టు "మనిషికి కేవలం నిజాయతీ ఉంటే సరిపోదు. తనకి తెలిసిన విషయాన్ని, మనసులోని అభిప్రాయాన్నీ సూటిగా చెప్పే ధైర్యం కూడా ఉండాలి. మీలో అలాంటి ధైర్యం ఎందరికి ఉందో తెలుసుకోవాలనుంది. చెప్పండి మంత్రిగారి ఖడ్గాన్ని దొంగిలించింది ఎవరు?" అన్నాడు. ఎవరూ నోరు మెదపలేదు.

అంతమందిలో లక్ష్మి అనే పదేళ్ల పిల్ల ముందుకొచ్చి "రాజుగారే దొంగ. ఆయన ఖడ్గం తీయడం నేను చూశాను" అంది.

ఆ పిల్ల తల్లిదండ్రులు భయంగా ఆ పిల్లని తీసుకెళ్లబోయారు. అప్పుడు మహారాజు "ఆగండి, ఆ పిల్లని ఇటు పంపండి" అన్నాడు.

చేసేది లేక వాళ్లు ఆ పిల్లని రాజు గారి దగ్గరికి పంపారు. అక్కడున్న వాళ్లందరూ 'మహారాజు ఆ పిల్లని ఏం చేస్తాడో' అని బెంబేలు పడసాగారు.

"ఏమ్మా, నేను మంత్రిగారి ఖడ్గం తీయడం నువ్వు చూశావా?" అన్నాడు ఆ పిల్ల కళ్లలోకి సూటిగా చూస్తూ.

ఆ పిల్ల ఎటువంటి బెదురూ లేకుండా అవునన్నట్టుగా తలూపింది.

'శహబాస్' అని మెచ్చుకుని తన మెడలోని పచ్చల హారాన్ని ఆ పిల్ల మెడలో వేసి "నేను మంత్రి గారి ఖడ్గాన్ని తీయడం మీరందరూ చూశారు. రాజోద్యోగులు కానీ, ప్రజలు కానీ ఎవరూ మాట్లాడలేదు. ఈ పిల్ల చిన్నదయినా తన నిజాయతీని ధైర్యంగా చాటుకుంది. నిజాయతీకి రాజైనా, సామాన్యుడైనా ఒక్కటే! రాజ్యం ఇటువంటి సాహసికులతో నిండి ఉన్నప్పుడే సుభిక్షంగా ఉంటుంది. ఇహనుండైనా మీరు మారతారని ఆశిస్తున్నాను" అన్నాడు.

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాద్

